


స్ప్రింగ్ డోరు తెరుచుకొని లోపలకెళ్ళాడు. ఎదురుగా కూర్చున్న ఆఫీసరుగారికి 'నమస్కారం' అన్నాడు. ఆయన తల వూపుతోటే దాన్ని స్వీకరించాడు. 'ఏమిటన్న'ట్లు చూపులతో అడిగాడు.

భద్రంగా రెండు రూపాయిల కోర్టు ఫీ స్టాంపు అంటించిన అప్లికేషన్ను రెండు చేతులతోటి వారి ముందుంచాడు.

"పి మ్మెంటా! .... ఇంకా యెలాట్మెంట్ రాలేదు. రాగానే చూస్తాను."

వెంకట్రామయ్య 'యెప్పుడొస్తుంది? యెప్పుడు చూస్తా'రని

అడుగుదామనుకొన్నాడుగాని, పెద్ద ఆఫీసర్ల దగ్గర చిన్నవాళ్ళు యెలా వుండాలో తెలిసినవాడు కాబట్టి అదీ అడగలేకపోయాడు.

సంశయ నివృత్తి కాలేదేమో బయటకు రావటమూ మర్చిపోయాడు.

"చెప్పానుగదయ్యా ఎలాట్‌మెంట్ రాలేదని. వచ్చేదానిలో అర్డర్ ఆఫ్ ప్రిఫెరెన్సును బట్టి యిస్తాంలే..ఈ లోపల ఆర్డై వచ్చి యెంక్వయిరీ చేస్తాడు."

"చిత్తం!"

సెలవు తీసుకొని బయట కొచ్చాడు.

ఎదురుగా "ఏం సార్! పనై పోయిందా?" పళ్ళికిలిస్తున్నాడు జవాను.

"అబ్బే.... లేదు."

"ఎన్ని బస్తాలకు పెట్టారేంటి?"

ఇతనేదో ఘటికుడులా ఉన్నాడు.

తను వచ్చింది సిమెంట్ కోసమే నని యెలా తెల్సింది?

సిక్త్‌సెన్సు లేదుగదా!

"సిమెంట్ చాలా టైట్‌గా వుంది సార్! పెద్ద పెద్దవాళ్ళే పడిగాపులు కాస్తున్నారు."

"మరేంటి దారి?"

"మనసంటూ ఉండాలేగాని, దారిలేకుండా ఉంటుందా?" మళ్ళీ నవ్వాడు.

ఆ నవ్వు వెంకట్రామయ్యకేమీ రుచించలేదు. వ్యవహారం మాట్లాడుతూవుంటే నవ్వుతాదేంటి? పోనీ మాట్లాడే మాట్లో హాస్యోక్తులేమైనా ఉన్నయ్యా అంటే అవీ లేవు.

"మీ రొట్టి అమాయకుల్లా ఉన్నారు సార్!"

చదువులు చెప్పే వెంకట్రామయ్యను యిట్టే చదివేశాడు. చుట్టుప్రక్కల యెవరూ లేక పోయినా ఒక ప్రక్కకు తీసుకెళ్ళాడు.

గోడకు చెవులుంటయ్యేమో నన్నంత రహస్యంగా వెంకట్రామయ్య చెవులను కొరికాడు.

వెంకట్రామయ్యకు అసలు రహస్యం తెలిసిపోయినట్లయింది.

జేబులోనుండి పదిరూపాయల నోటు తీసి అతని చేతిలో వుంచాడు.

అతను నమస్కారం చేస్తూ, "నే చూస్తానుగదండీ! ఆ కాగితం అన్నింటికంటే ముందు అయ్యగారి జేబుబుమీద పెట్టే బాధ్యత నాది.... ఇక మీరెళ్ళి రండి."

వెంకట్రామయ్య అప్లికేషను పెట్టిన వారం రోజులకి ఆర్డై

వచ్చాడు. అయ్యగారు ఎంక్వయిరీ కొచ్చారని ముందు జవాను వచ్చి చెప్పాడు.

వెంకట్రామయ్య యెదురేగి స్వాగతం చెప్పాడు.

కుర్చీ వేశాడు. కాఫీ యిచ్చాడు.

కాఫీతోబాటు యింటి ప్లాను, ఎస్టిమేటు కాఫీలను కూడా సమర్పించాడు.

ఆయన యిచ్చిన కాగితాలను చూస్తున్నాడే గాని మాట్లాడటం లేదు.

తన జీవితకాలమంతా యెలా పైసా, పైసా పోగుచేసి యిల్లు కట్టుకోవటానికి దాచుకొన్నదీ, యెన్ని అవసరాలను వెనక్కినెట్టిందీ, యెటువంటి భోగాలను కాలదన్నిందీ వెంకట్రామయ్య యేకరువు పెడుతూనే ఉన్నాడు.

కాని ఆయన ఉంకటం లేదు; పలకటం లేదు.

అయినా తన స్వప్నాకృతి ఆయనకు కావాలని ఏముంది?

ఇదంతా గమనిస్తున్న జవానుకు వెంకట్రామయ్య ప్రపంచ జ్ఞానం బొత్తిగా తెలీని వెర్రివెంగళప్పలా కన్పించాడు.

అయ్యగారేమో గ్రుడ్డి పాము.

కన్నులు, బుస్సులుండవు. ఏదో యింత దొరికితే తినటం, నిద్రపోవటమే తెల్సు ఆయనకు.

తను రంగంలోకి దిగకపోతే లాభంలేదనుకొని, "అయ్యగారూ! మీరొకసారి యిటు రండి." వెంకట్రామయ్యను పిలిచాడు.

కాబోయే కార్యం గంధర్వుల వల్లగాని కాదనుకొంటూ ప్రక్కచూరుక్రింద కెళ్ళాడు.

వాళ్ళిద్దరికే తెలిసేటట్లు గుసగుస లాడారు.

ప్రక్కనున్నవాళ్ళకి వినపడినా పరవాలేదనే విధంగా అర్రైని గట్టిగానే తిడుతున్నాడు జవాను.

గడ్డి తింటాడన్నాడు.

దయా, జాలీలేని కర్కోటకుడన్నాడు.

ఎక్కువ పట్టువదలని మొండివాడన్నాడు.

ఐనా పని కావాలంటే తప్పదన్నాడు.

వెంకట్రామయ్యకు మతిపోలేదుగాని ఆశ్చర్యమేసింది. 'ఇది' యింతగా చీర విప్పుకొని స్వైర విహారం చేస్తున్నందుకు అసహ్యమేసింది.

కాని తప్పదు.

తన కోపమే తన శత్రువన్నట్లు, తన అసహ్యం తన పనినే ఆటంక పరుస్తుంది.

కాకపోతే ఈ జవాను కొంచెం నయంలా ఉన్నాడు.

పాపపుణ్యాలూ, కొంచెం నీతి భీతి ఉన్నాడిలా తోస్తున్నాడు.

"మరీ అంతైతే యెలా? కొంచెం తగ్గేటట్లు చూడు బాబూ!"

అంత పెద్దవాడు ప్రాధేయపడుతున్నందుకు జాలివేసినట్లుంది.

అయ్యాగారి దగ్గర కెళ్ళాడు. చెవులో వూదాడు.

ఆయన 'ససేమిరా' అన్నట్లు తల వూపుతున్నాడు.

మళ్ళీ జవానేదో చెప్తున్నాడు.

అయ్యగారు అర్ధంగీకారం తెల్పినట్లుగా పెదవి విరచి 'కానివ్' అన్నట్లు నోరు చప్పరిస్తున్నాడు.

ఇదంతా వెంకట్రామయ్యా గమనిస్తూనే ఉన్నాడు.

జవాను వచ్చి, "సరే... మీరు చెప్పిన దానికి మరో పాతిక కలిపి పారెయ్యండన్నాడు.

అంతకు తగ్గితే యీ రాయభారం చేయటం తనవల్ల కాదంటున్నాడు.

వెంకట్రామయ్య లోనకెళ్ళి మళ్ళీ వచ్చాడు.

అయ్యగారి సమక్షంలోనే జవాను దాన్నందుకొన్నాడు.

తదనంతరం ఆర్సై ఒక చిరునవ్వు మాత్రం నవ్వి లేచాడు.

"మీరు మాత్రం రెండు రోజుల్లో ఆఫీసుకు రండి. అయ్యగారు అప్పటికి రికమండేషన్ చేసి పంపుతారు."

"అలాగే బాబూ!" కొంచెం దూరం సాగనంపి వీడ్కోలు నమస్కారం చేసి వచ్చేశాడు.

వెంకట్రామయ్య యెందుకైనా మంచిదని నాలుగు రోజుల తర్వాత ఆఫీసుకెళ్ళాడు.

అప్లికేషన్ ఆఫీసులో వున్న మాట నిజమే!

అలాగని ఆ పిమెంటు క్లార్కే చెప్పాడు.

ఎలాట్మెంట్ కూడా వచ్చినట్లు చెప్పాడు.

కాని దీనిముందు చాలా వున్నవని, వాటిల్లో పెద్ద పెద్దవారివేగాక రికమండేషను బాపతులు కూడా ఉన్నాయన్నట్లు వాక్రుచ్చాడు.

ఈ యెలాట్మెంట్ అయిపోయిన తర్వాత మళ్ళీ యెప్పుడొస్తుందో కూడా యితమిద్ధంగా చెప్పలేమన్నాడు. అదుగో యిదుగో అంటే కనీసం రెండు నెలలైనా పట్టవచ్చునన్నాడు.

"కాదు బాబూ! మీరెలాగైనా యీ సాయంచేసి పెట్టాలి. రెండు నెలలాగితే వర్షాలు ప్రారంభమౌతవి.

కథా నిలయం
విజయ

"అదేకదండి—అందరి ఆందోళన. అందుకనే ప్రతివాడూ యెలాగో అలా చేసిపెట్టమంటాడు.... అటువంటప్పుడు ముందే యెందుకు అప్లికేషన్ పెట్టలేకపోయారు?" మాటల్లో కొంచెం విసుగుదల కన్పించింది.

పేదవాడి కోపం పెదవికి చేటు.

క్లార్కు విసుక్కున్నాడని తనూ తిరగబడితే ... అసలుకే మోసం వస్తుంది.

పైగా, కాదు అని ఖచ్చితంగా చెప్పటంలేదు.

అట్లని మార్గాలూ చెప్పటం లేదు.

వచ్చే అవకాశమూ ఉంది; అంతేమేరకు రాని అవకాశమూ ఉంది.

ఈ ఎలాట్మెంట్ లోనే పిమెంట్ రాకపోతే నానాయాతన పడాల్సి వస్తుంది.

ఈ లోపల గుమస్తాలందరూ లంచవరుకు లేచారు.

పిమ్మెంట్ గుమస్తాగారూ లేచారు.

"రండి సార్! అటు అప్సర కెళ్దాం." ధైర్యం చేసి వెంకట్రామయ్య అడిగాడు.

"ఎందుకండీ? యిక్కడ హోటలుందిగా!" గుమస్తా మొహమాటం పోయాడు.

"ఇదస్సలు బాగోదండి!" తనెప్పుడూ ఆ హోటల్లోనే తినే వాడులా అని, 'ఫరవాలేద'ంటూ అప్సరవైపుకు దారి తీశాడు. గుమస్తాకూడా వెంట నడిచాడు.

స్వీట్లు, హాట్లు ఆర్డరు చేసిన తర్వాత వెంకట్రామయ్య పిమెంట్ యివ్వకపోతే తనే విధంగా యిబ్బందుల పాలయ్యేది వివరంగా విన్నవించుకొన్నాడు.

ఆఖరకి ఆఫీసుకెళ్తూ, దారిలో 'సరే' అన్నాడు. అదీ ఆఫీసరుగారి యిష్టాయిష్టాలకు లోబడి. 'యిన్ని' అని చెప్పలేమన్నాడు.

తనలాగా ఆయనంత తేలిగ్గా లొంగే మనిషికాదట.

చిన్నా-పెద్దా తేడా లేకుండా ప్రతిదానికి కావాలంటాడట.

ఆయన క్రింద పనిచేయలేక చచ్చి పోతున్నాడట.

ఇంతలో ఆఫీసు దగ్గరౌతుంది.

మళ్ళీ ఆ సీట్లో కూర్చుంటే యివన్నీ తాపీగా మాట్లాడటానికి వీలుపడదు. పోనీ మర్నాడొద్దామంటే యిప్పటిలాగ మరో పది రూపాయిలు ఖర్చు.

"అంతా మీ మీద పెట్టాను. మీరెంత చెప్తే అంత. బీదవాడిని."

ప్రాధేయపూర్వకంగా అడిగాడు ఆఖరికి.

బీదవాణ్ణన్నందుకు కోపం వచ్చింది గుమస్తాకి. "మీతో వచ్చిన చావే యిది.... పోనీగదాని బ్రతిమాలుతుంటే పైనేసుకుందా మనుకొన్నాను గాని, మీరిచ్చేది నా జేబులో పడ్డుందేంటి?" కోపం గానే అన్నాడు.

తిరిగి ప్రసన్నుణ్ణి చేసుకోవ టానికి పది నిమిషాలు పట్టింది.

ఎలాగైతేనేం బస్తాకి రెండు రూపాయిలు చొప్పున బేరాన్ని తెగగొట్టారు.

"ఎల్లుండి రండ"న్నాడు క్లార్కు.

వచ్చే బస్తాలకు సరిపడే డబ్బును జేబులో వేసుకొని బయలుదేరాడు మూడోనాడు వెంకట్రామయ్య.

క్లార్కు సీటు చూపించి, "మీ పని ఐపోయిం"దన్నాడు పర్మిట్లు రాస్తూ.

ఎవరూ చూడకుండా ఆ డబ్బు అతనికందజేశాడు.

పర్మిట్లు యిచ్చోయాయి.

ఆఫీసు సీలు వేయటానికి జవానుని పిలిచాడు.

"రండి సార్!" జవాను వాటి నందుకొని వెంకట్రామయ్యను పిలిచాడు.

పర్మిట్లందుకుంటూ అతని చేతిలో ఒక రూపాయి ఉంచాడు.

"ఏమిటిసార్! ఇదేం ధర్మం?"

వెంకట్రామయ్య కేమి చేయాలో పాలుపోలేదు. వచ్చిన కోపాన్ని పెదాలవరకే పరిమితం చేసుకున్నాడు.

తప్పదు-లేకపోతే పీనాపివెధవని తిడతాడు.

ఆ రూపాయి జేబులో నొక్కి-ఐదు రూపాయిల కాగితం తీశాడు. అప్పుడు కూడా దాన్ని మహా ప్రసాదంలా స్వీకరించలేదు. "ఊఁ!" అంటూ అందుకున్నాడు.

* * *

"నువ్వు సిమెంట్ అప్లికెంట్లు దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నా వనీ, యివ్వకపోతే బెదిరిస్తున్నావని పిటీషను వచ్చింది. అంతవరకైతే ఫరవాలేదు. నా పేరు చెప్పి కూడా వసూలు చేస్తున్నావని తెల్సింది. ఏమంటావ్?" ఆఫీసరుగారు ఆర్డైని గద్దించి అడుగుతున్నారు.

"లేదాసార్! అవన్నీ బట్ట అబద్ధాలు! ఎవరో గిట్టనివాళ్ళు

పెట్టి ఉంటార్సార్!" ఆర్రైత్రి వినయ విధేయతలతో సంజాయిషీ చెప్పుకు పోతున్నాడు.

"అంతేనంటావా?" సూటిగా ముఖంలోకి చూపి, "రేపు యంక్వయిరీకి వస్తున్నా. అప్పుడే తేలుతుంది. నౌ యు కెన్ గో" అన్నాడు.

తర్వాత సిమ్మెంటు గుమస్తాని పిలిచారు.

"నిన్నా సీటునుండి మార్చే స్తున్నాను."

గుమస్తా గుండెల్లో రాయి పడ్డది.

"నేనేమీ తప్పు చేయలేద్సార్! ఏదైనా పొరపాటు చేస్తేచెప్పండి- సరిదిద్దుకుంటాను."

"మంచివాడివని ఆ సీటిచ్చాను. కాని యిన్ని గొడవలు తెచ్చి పెడతావనుకోలేదు....పైగా నా పేరుపయోగించి వచ్చే పార్టీల్ని ఒడిగేస్తున్నావట."

"లేద్సార్!"

"ఏం లేదు?" ఆఫీసరుగారు ఉగ్రులైపోయారు. "చిన్నా పెద్దా చిదా బిక్కీ అనే తారతమ్యం లేకుండా ప్రవర్తిస్తున్నావ్. ఏమన్నా వస్తే మీకుగాదు వచ్చేది, నాకు....నాకయ్యా ...మీరు మీ యిష్టమొచ్చినట్లు ప్రవర్తించటానికి గాదు నేనిక్కడున్నది. ఎడ్మినిస్ట్రేషన్ని సరిగ్గా నడపటానికి కున్నాను. మీ వంటి వాళ్ళు తెచ్చే చెడ్డపేరు మోస్తూ 'ఇన్ ఎఫిషియంట్' అని పేరొందటానికి రాలేదు. మైండిట్....రేపటినుండి నీ సీటు మార్చి డిస్పాచ్‌లో వేస్తున్నా- వెళ్ళు."

* * *

మర్నాడు ఆఫీసులో పెద్ద మార్పులు రాబోతున్నాయని ఎదురు చూస్తున్న వాళ్ళు, యెదురు చూస్తూనే ఉన్నారు.

ఆఫీసర్ ఆర్రైత్రిమీద వచ్చిన పిటీషను పట్టుకొని ఎంక్వయిరీ కెళ్ళలేదు.

సిమెంట్ గుమస్తా సీటూ మారలేదు.

ఆ రాత్రే వాళ్ళిద్దరూ ఆఫీసరు యింటికెళ్ళి సరిజేసుకొన్నారని ఆఫీసరుగారి జవానుకు మినహా యితరులకెవ్వరికీ తెలియదు.

కష్టపడి కూడబెట్టుకొన్న వాటిని ఎలుకలు మేస్తే, వాటిని పిల్లులు తింటాయని ఆఫీసరుగారి జవాను అనేవరకు అసలు కథ అందరికీ అర్థంకాలేదు. *